క్లుప్తంగా

మహిళల చట్టాలపై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సుబ్బారావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సత్రంపాడులోని యూనియన్ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో మహిళలకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై ఎం సుబ్బారావు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ ద్వారా పొందగల ఉపయోగాలను వివరించారు. ప్రతి మహిళా మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ సమయంలో తమ ప్రాథమిక వివరాలు, ఎమర్జెన్సీ కాంటాక్ట్ నంబర్లు ఇవ్వాలని సూచించారు. అత్యవసర సమయంలో యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ నొక్కితే, వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరుతుందని, సమీపంలోని పోలీస్ టీం వెంటనే సహాయం అందిస్తుందని వివరించారు. మహిళలకు శక్తి యాప్ వినియోగంపై ప్రాక్టికల్ డెమో చూపించారు.

వైఎస్సార్‌టీయూసీ ఏలూరు అధ్యక్షుడిగా రాజేశ్వరరావు



ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరు నగరానికి చెందిన ఘంటా రాజేశ్వరరావును వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఏలూరు నియోజకవర్గం అధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్, పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావుకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో కార్మికుల సమస్యలపై వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పల్లి శ్రీనివాస్, జిల్లా నేతల ఆదేశాలపై పోరాటం చేస్తామని తెలిపారు.

న్యాయం చేయాలంటూ వినతి

ఏలూరు (టూటౌన్): తమకు న్యాయం చేయాలంటూ ఎస్సీ పోలియా దాసరి కులస్తులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సంచార జాతులుగా నివశించే తాము భీమడోలు మండలం పోలసానిపల్లి గ్రామంలో స్థిరనివాసం ఏర్పాటు చేసుని, సుమారు 30 సంవత్సరాలుగా నివశిస్తున్నామని తెలిపారు. తమకు కుల ధ్రువీకరణ, మైగ్రేషన్, పింఛన్లు, ఇళ్ల స్థలాలు రావడం లేదని, సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇండోర్ స్టేడియం కనుమరుగు

- ఎందరో క్రీడాకారులను అందించిన వైనం
- శిథిలాలను తొలగిస్తున్న అధికారులు



తొలగిస్తున్న ఏలూరు ఇండోర్ స్టేడియం శిథిలాలు

ఏలూరు రూరల్ : ఏలూరు ఇండోర్ స్టేడియం తెరమరుగౌతోంది. ఎందరో వెయిట్ లిఫ్టర్లు, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్ తదితర క్రీడాకారులకు మధుర జ్ఞాపకంగా మిగిలిపోనుంది. ఏడాదిన్నర క్రితం ఇండోర్ స్టేడియం పైకప్పు కూలిపోయింది. దీంతో అధికారులు మూసివేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు భారీ ఎత్తైన గోడల ప్రమాదకరంగా మారడంతో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు స్టేడియం శిథిలాలను తొలిగిస్తున్నారు. ప్రొక్లెయిన్‌తో గోడలు కూల్చి, శిథిలాలను ఇతర ప్రాంతానికి తరలిస్తున్నారు. పాడైన వస్తువులు, ఐరన్ హౌసింగ్ శాఖ అధికారుల ద్వారా వేలం నిర్వహించనున్నారు.

మధుర జ్ఞాపకం

సుమారు 60 ఏళ్ల క్రితం నిర్మించిన ఇండో ర్‌స్టేడియం ఎందరో క్రీడాకారులతో పాటు క్రీడాభిమానులకు సైతం మధుర జ్ఞాపకాలను అందించింది. ఈ స్టేడియంలో సాధన చేసిన అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. స్టేడియం ప్రారంభమైన తొలి రోజుల్లో బాస్కెట్‌బాల్, వెయిట్‌లిఫ్టింగ్ సాధన చేసేవారు. పలుసార్లు రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్, కుస్తీ, కబడ్డీ, కరాటే పోటీలు నిర్వహించారు. తర్వాత కాలంలో డీఎస్ఏ అధికారులు కొందరు సాధకుల సహకారంతో బ్యాడ్మింటన్ ఉడెన్ కోర్టు అభివృద్ధి చేశారు. దీంతో బ్యాడ్మింటన్‌కు అనువుగా మారింది. ఇక్కడ సాధన చేసిన పలువురు బ్యాడ్మింటన్ క్రీడాకారులు జాతీయ స్థాయిలోనూ రాణించారు.

కొత్త స్టేడియం నిర్మించాలి



ఇండోర్ స్టేడియం కూలిపోవడంతో ఇండోర్ ఆటలు నిర్వహణ, సాధన జరగడం లేదు. ఇక్కడ సాధన చేసిన బాలబాలికలు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. కూలిపోయిన స్టేడియం స్థానిలో కొత్త స్టేడియం నిర్మించాలి. ఇందులో అన్ని రకాల క్రీడలు నిర్వహణ, సాధన జరిగేలా చూడాలి. లేదంటే ఇండోర్ క్రీడల్లో జిల్లా బాలబాలికల వెనకబడి పోతారు. ఇందుకోసం ప్రభుత్వం త్వరితగతిన చర్యలు చేపట్టాలి.

– ఎస్ సత్యనారాయణ, వాకర్

మల్టీపర్పస్ స్టేడియంకు ప్రయత్నం



ఏలూరులో శిథిలమైన ఇండోర్ స్థానంలో కొత్త మల్టిపర్పస్ ఇండోర్ స్టేడియం కట్టేందుకు ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.14 కోట్లు మంజూరయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే డీపీఆర్ తయారు చేయాలని జిల్లా గృహనిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. ఇంజినీర్లు స్థలం పరిశీలించి, కొలతలు తీసుకున్నారు. బాస్కెట్‌బాల్, హ్యాండ్ బాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ తదితర ఇండోర్ క్రీడలు సాధన చేయడంతో పాటు పోటీలు నిర్వహించేందుకు అనుకూలంగా నిర్మాణం ఉంటుంది.

– బి శ్రీనివాస్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

అంబేడ్కర్ విగ్రహం వద్ద బీజేపీ తోరణాలా?



నిరసన వ్యక్తం చేస్తున్న తేరా ఆనంద్

ఏలూరు టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ జెండాలు కట్టటం ద్వారా బీజేపీ నేతలు తమ కుట్రపూరిత రాజకీయాలకు తెరతీశారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్ ఆరోపించారు. ఏలూరు పాతబస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ జెండాలు కట్టడం ఆయన్ని అవమానించటమే అన్నారు. బీజేపీ రాష్ట్ర నేతల పర్యటనల సందర్భంగా అవసరం అయితే జాతీయ జెండాలు కట్టాలి కాని, బీజేపీ కాషాయం జెండాలు ఏవిధంగా కడతారో చెప్పాలని ప్రశ్నించారు. కూటమి పాలనలో ఒకవైపు ఎస్సీ కులాల మహిళలు, బాలికలపై దాడులు, దౌర్జన్యాలు, అఘాయిత్యాలు జరుగుతున్నా కూటమిలోని బీజేపీ నేతలు ఎవరూ నోరు మెదపటం లేదని అన్నారు. మరోవైపు ఎస్సీ కులాలపై హత్యలు, అక్రమ కేసులు, దాడులు చేస్తుంటే ఏం చేస్తున్నారని నిలదీశారు. తమ కుటిల, అహంకార పూరిత రాజకీయాలకు ఇదే నిదర్శనం అని పేర్కొన్నారు.

చెన్నై సంస్థతో 'సీఆర్ఆర్' ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల చెన్నైకి చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సంస్థతో అవగాహన ఒప్పందం చేసుకున్నట్టు ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను ఇచ్చిపుచ్చుకున్నారు. పరిశోధన, అధ్యాపకులకు శిక్షణ, జాయింట్ కన్సల్టెన్సీ ప్రాజెక్టులు, ఆధునిక ఆవిష్కరణలు, సాంకేతిక విద్య తదితర అంశాల్లో ఇరుసంస్థలు అనుభవాలు, నైపుణ్యాలను పంచుకుంటాయని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ ఎన్ దీపక్, ఈసీఈ అసోసియేట్ ప్రొఫెసర్ డి. అజయ్ కుమార్, ఎన్ఐటీటీఆర్ డైరెక్టర్ ఉషా నటేశన్ అధ్యాపకులు పాల్గొన్నారు.

13 నుంచి స్వాములకు భిక్ష



కరపత్రం విడుదల చేస్తున్న అన్నదాన సమాజం ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన అన్నపూర్ణ సహిత హరిహరపుత్ర అయ్యప్ప స్వామి అన్నదాన సమాజం ఆధ్వర్యంలో అక్టోబర్ 13 నుంచి అయ్యప్ప మాలధారులకు తృతీయ భిక్ష కార్యక్రమం ప్రారంభించనున్నట్టు సమాజం అధ్యక్షుడు కొట్టు మధు వెంకటరావు తెలిపారు. బుధవారం స్థానిక రామకోటి ప్రాంగణంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత నాలుగేళ్లుగా నగరంలో అయ్యప్ప స్వాములతో పాటు వేంకటేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి, సాయిబాబా మాల ధరించిన స్వాములకు భిక్ష కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించామని తెలిపారు. అక్టోబర్ 13 నుంచి ప్రారంభించే భిక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 27న రాట ముహూర్తం నిర్ణయించామని చెప్పారు. నవంబర్ 18న అయ్యప్ప స్వామికి శాకంబరి అలంకరణ చేస్తామని తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ నెలలో నగరంలో జాతర మహోత్సవం జరుగుతున్నా మాలలు ధరించవచ్చని పండితులు తెలిపారని వివరించారు. జాతరకు అయ్యప్ప మాలధారణకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ఈ సందర్భంగా భిక్ష కరపత్రం విడుదల చేశారు. సమావేశంలో అన్నదాన సమాజం ప్రతినిధులు వై.సుబ్బారావు, మారం జయ సూర్య, కొట్టు మనోజ్, మద్దుల గోపాల్, కొట్టు అప్పారావు, గాదంశెట్టి రమేష్ కుమార్, సుంకర రాంబాబు, చింత దుర్గేష్, ఎల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాజ్‌వేపై వంతెన నిర్మాణంలో నిర్లక్ష్యం

ఏలూరు (టూటౌన్): తమ్మిలేరు శనివారపు పేట కాజ్ వేపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయినా పనులు ప్రారంభించకుండా తాత్సరం ఎందుకని సీపీఎం ఏలూరు నగర కమిటీ ప్రశ్నించింది. సీపీఎం ప్రతినిధి బృందం శనివారపు పేట కాజ్ వేను బుధవారం సందర్శించి నిరసన వ్యక్తం చేసింది. సీపీఎం నగర కార్యదర్శి పంపన రవి కుమార్, శనివారపు పేట మాజీ ఎంపీటీసీ సభ్యులు గొట్టాపు రవికిషోర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.15 కోట్లతో వంతెన నిర్మిస్తామని చెప్పి, నేడు మౌనవ్రతం ఎందుకని ప్రశ్నించారు. ప్రతి ఏటా కాజ్ వే మూతపడటం ఏలూరు ప్రజాప్రతినిధులకు సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా వంతెన నిర్మాణం ప్రారభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయుకులు వైఎస్ కనకారావు, ఎస్ సత్యనారాయణ, మీసాల సత్యం, పి.సూర్యనారాయణ, చంద్రరావు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	70
వంకాయలు (కాంతులు)	40	బీళ్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	36
బెండకాయలు	32	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	44	కంద	00
కాకర కాయలు	34	బీట్‌రూట్	38
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	40-48	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	44	పాలకూర	10
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	18	చుక్కకూర	10
గోరుచిక్కుడు	38	గోంగూర	07-10
దోసకాయలు	24-28	పుదీనా	05
ఆనబకాయ (1)	20-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	31
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	35
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	20
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

మాధవ్ వ్యాఖ్యలపై ఆగ్రహం

ఏలూరు (టూటౌన్): విశాఖ ఉక్కు పరిరక్షణకు పోరాటాలు చేస్తోంది కమ్యూనిస్టు పార్టీలు, వామపక్ష ప్రజాసంఘాలు మాత్రమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్ఫూర్తి భవనంలో ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకోవడం చేతకాక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వామపక్ష కార్మిక సంఘాలు, కమ్యూనిస్టులపై నెపం నెడుతున్నారని మండిపడ్డారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ముక్కలు చేసి అమ్మేస్తుంటే స్పందించకపోగా టీడీపీ, జనసేన నాయకులు ప్రైవేటీకరణ జరగదని బుకాయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. మాధవ్ తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పారదర్శకంగానే భూసేకరణ

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం సేకరించే భూములు పారదర్శకంగా సేకరించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులతో భూసేకరణపై సమావేశం నిర్వహించారు. అనంతరం జేసీ విలేకరులతో మాట్లాడుతూ భూసేకరణలో ఎటువంటి ఆరోపణలు రాకుండా అన్ని హక్కులు ఉన్న గిరిజనేతరుల భూముల్లో మాత్రమే సేకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ ఎంవీ రమణ, ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్, డీపీఓ కె.అనురాధ, డీఎల్‌పీఓ ఎం.రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు చంద్రశేఖర్, ఆంజనేయులు, సతీష్, తహసీల్దార్లు వీవీ చలపతిరావు, ఉదయ్, ఎంపీడీఓ కె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

జంగారెడ్డిగూడెం: పామాయిల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని పామాయిల్ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. పామాయిల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై బుధవారం ఆయిల్‌పామ్ కార్మిక సంఘం జిల్లా మహా సభల్లో తీర్మానాలు చేశారు. నూతనంగా ఎన్నికయి సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.రామకృష్ణ, సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జె.హరీష్, టి.సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో సుమారు పదిహేను వేల మంది కార్మికులు ఆయిల్‌పామ్‌పై జీవనం సాగిస్తున్నారని వారికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

మహిళలను మోసం చేసిన 'కూటమి'



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న శేషుకుమారి



శేషుకుమారిని సత్కరించిన మహిళా నాయకులు

ఏలూరు టౌన్: సూపర్ సిక్స్ హామీలంటూ నమ్మించి రాష్ట్రంలోని మహిళలను కూటమి ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జోనల్ మహిళా అధ్యక్షురాలు మాకినీడి శేషుకుమారి విమర్శించారు. ఏలూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావును ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పీఏసీ సభ్యులు, ఉంగుటూరు సమన్వయకర్త పుప్పాల వాసుబాబు, నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేక వెంకట ప్రతాప్ అప్పారావు, చింతలపూడి సమన్వయకర్త కంభం విజయరాజుతోనూ కొద్దిసేపు పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. ఏలూరు జిల్లాలో త్వరలో భారీగా మహిళలతో సమావేశం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. అనంతరం శేషుకుమారిని ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షులు కేసరి సరితారెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఇంజేటి నీలిమ, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి తుమరాడ స్రవంతి ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళ విభాగం కార్యదర్శి మంద జయలక్ష్మి, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షులు సాయల స్వాతి, కంచుమర్తి తులసి, పెదగర్ల స్వరూపరాణి, ఏలూరు నగర మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, చింతలపూడి నియోజకవర్గం మహిళ అధ్యక్షులు చండిప్రియ, కామవరపుకోట ఎంపీటీసీ తమ్మిశెట్టి గిరిజ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస డాంగే

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ), ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు విమర్శించారు. స్థానిక శ్రీకాశీ విశ్వేశ్వర కళ్యాణ మండపంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు నగర సమితి యూనియన్ సమావేశం యలగాడ దుర్గారావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సమావేశంలో శ్రీనివాస్ డాంగే, శ్రీనివాసరావు మాట్లాడుతూ పురపాలక, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లోని ఔట్‌సోర్సింగ్ కార్మికులను ఎన్నికల హామీ మేరకు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికుల పెండింగ్ డీఏలు, సరెండర్ లీవ్‌లు ఇవ్వాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు ప్రకటించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు గత ప్రభుత్వం ఆప్కాస్ సంస్థ ఏర్పాటు చేసి అందులో ఎంప్లాయ్ అని పొందుపరిచి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, విధి నిర్వహణలో కార్మికులు మరణిస్తే ఆ కుటుంబ సభ్యులకు కారుణ్య నియమాకాలలో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డిగర్ల నాగబాబు, ఏలూరు నగర సభ్యులు నెట్టం రంగారావు, గంట జానకిరామ్, ఫెడారి వంశీ, సోమధుల మల్లేశ్వరరావు, బంగారు లోకేష్, అంతరాజ్ లీలా ప్రసాద్, సతీష్, అల్లం పెద్దిరాజు, మాడుగుల జగదీష్,గోవాడ మల్లేశ్వరరావు, భాస్కర రావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి పవిత్రోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం శ్రీమత్ విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, ప్రధాన కుంభ స్థాపన, అగ్ని ప్రతిష్టాపన చేశారు. చతుస్థానార్చన చేసి స్వామి వారికి 54 కలశాలతో స్నపన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బడేటి చంటి ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారికి పవిత్రాలు సమర్పించారు. సాయంత్రం శ్రీమత్ విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, చతుస్థానార్చన చేశారు. నిత్యహోమాలు నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. ఆలయ అర్చకుడు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి సతీష్ కుమార్ నల్లూరి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

జూట్ పరిశ్రమలను ఆదుకోవాలి



శోభాయాత్రలో పాల్గొన్న మాధవ్

ఏలూరు (టూటౌన్): ఏలూరులోని జూట్ పరిశ్రమను ఆదుకోవాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. బుధవారం స్థానిక బిర్లాభవన్ హోటల్‌లో నిర్వహించిన చాయ్‌పే చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడు తూ పామాయిల్, కోకో, కొబ్బరి రైతులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఏలూరు నిమ్మ మార్కెట్‌కు ప్రసిద్ధి అని, ఇక్కడ నిమ్మకాయల ప్రొసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆరోగ్య శ్రీ , ఆయుష్మాన్ భారత్ పథకాలను అనుసంధానించి వైద్య సేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా కూడా యువతకు అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. నగరంలో శోభాయాత్ర మాధవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మాధవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాత బస్టాండ్ సెంటర్ నుంచి జూట్ మిల్లు వరకు భారీ పాదయాత్ర నిర్వహించారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, బొల్లిన నిర్మల కిషోర్, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, ఏపీ ఆర్టీసీ జోనల్ చైర్మన్, జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల హామీలపై చట్టాలు చేయాలి



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న సింహాద్రి కనకరాజు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గత ఎన్నికలకు ముందు విశ్వబ్రాహ్మణులకు టీడీపీ ఎన్నో హామీలు ఇచ్చిందని, వాటన్నింటినీ చట్టాలుగా చేయాలని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సింహాద్రి కనకరాజు కనకాచారి కోరారు. స్థానిక పవర్ పేట శ్రీ కామాక్షి విశ్వబ్రాహ్మణ ధర్మసత్రం చైర్మన్ ప్రమాణ స్వీకార మహోత్సవంలో సత్రం చైర్మన్ యాలబాక కృష్ణతో ఎమ్మెల్యే బడేటి చంటితో పాటు విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు ప్రమాణం స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి, అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చింతాడ బ్రహ్మానందం, కేకేఎస్ సంస్థల యజమాని కాద రాంబాబు, దేవాదాయ శాఖ అధికారి భవిరి రవి, వేముల దుర్గాప్రసాద్, లక్కోజు వెంకటేశ్వరరావు, సింహాద్రిపురం ఆచారి, బొద్దూరి నాగ భూషణం తదితరులు పాల్గొన్నారు.